క్లుప్తంగా

తీరంలో అభివృద్ధి పనుల పరిశీలన



తీరంలో బుద్ధుని బొమ్మను పరిశీలిస్తున్న అధికారులు

భీమునిపట్నం: భీమిలి తీరంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.17 లక్షలు మంజూరు చేసింది. ఇక్కడి బీచ్ పార్కు, పైలాన్ మరమ్మతులు, పోలమాంబ ఆలయం వద్ద రక్షణ గోడ, ఫుట్‌పాత్ ఏర్పాటుతోపాటు మరికొన్ని పనులు నిర్వహిస్తారు. అలాగే ఇటీవల వచ్చిన తుఫానుకు బీచ్ ఫుట్‌పాత్ పక్కనున్న బుద్ధుని విగ్రహం ఇసుకలోకి ఒరిగిపోయింది. దాన్ని కూడా పైకి తీసి అంతకు ముందున్న చోట మళ్లీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్, సిబ్బంది తీరంలో పరిశీలించారు.

అంతర్జాతీయ పోటీలకు భీమిలి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు, కోచ్

భీమునిపట్నం: విశాఖలో నిజీ షోటోకాన్ దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే అంతర్జాతీయ కరాటే పోటీలకు భీమిలికి చెందిన షాడో షోటో కాల్ కరాటే దూ అసోసియేషన్ విద్యార్థులు వి.సుశాంత్, కె.మోహన్‌శ్రీ, సీహెచ్.శివరాం ఎంపికయ్యారు. ఈ మేరకు చీఫ్ కోచ్ ముగడ రమణయాదవ్ మంగళవారం వీరిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఇప్పుడు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

కామర్స్‌లో రాముకు డాక్టరేట్



వీసీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న రాము

ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాడ రాము కామర్స్‌లో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి మంగళవారం ఉత్తర్వులు అందుకున్నారు. రీసెర్చ్ డైరెక్టర్ కేవీ రమణ మూర్తి ఆధ్వర్యంలో కామర్స్ విభాగంలో 'అసెస్‌మెంట్ అండ్ సబ్‌స్టెయినబులిటీ ఆఫ్ హెచ్‌ఆర్‌డీ ప్రాక్టీస్, ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ ఆగ్రో అండ్ మినరల్ ఇండస్ట్రియల్ యూనిట్స్ ఇన్ విశాఖపట్నం అనే అంశంపై పరిశోధన చేశారు. అందులో భాగంగా పరిశ్రమల స్థితిగతులు, ఉద్యోగుల వేతనాలు, సౌకర్యాలు, పనిచేయగల స్థితి తదితర అంశాలపై రాము పరిశోధన సాగించారు. ఈ మేరకు కామర్స్ విభాగాధిపతి జె.రవి తదితరులు రామును అభినందించారు.

తాళ్లవలస పీహెచ్‌సీ పరిశీలన

తగరపువలస: జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆశా డే, పరిశుభ్రత, స్టోర్‌లో మందులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. సిబ్బంది సేవా భావంతో పనిచేయాలని కోరారు. ఆయనవెంట డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ ఉమావతి, పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు ఉన్నారు.

ఏఎన్‌ఎం అదృశ్యం



ఉప్పాడ మానస

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేటకు చెందిన ఉప్పాడ మానస అనే ఏఎస్‌ఎం ఈ నెల 2న అదృశ్యమయిందని తల్లి భారతి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆనందపురం మండలం బోయిపాలెం వద్ద ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఏఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కరించడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఇంటింటికీ పంపిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని కొమ్మాది జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ వైఎస్సార్ కాలనీ 72వ నంబరు సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. 29వ బ్లాకు నుంచి 38వ బ్లాకు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు, చేతి బోర్లు ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రానికి భవనం, కల్యాణ మండపం, సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకొచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ముత్తంశెట్టి ఆదేశించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలతోపాటు ఇంటి స్థలాలు కేటాయించి తమ బతుకుల్లో వెలుగులు నింపుతున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని... ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల కళ్లల్లో వెలుగులు చూడాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వార్డు ఇన్‌చార్జి పోతిన సురేష్, సచివాలయ ఇన్‌చార్జి బందారు శివలక్ష్మి, రాధ, అప్పలరాజు, జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, హౌసింగ్ ఏఈ సూర్యప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీను, ఏపీడీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనుమతి

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి క్రికెట్ స్టేడియం వైపునకు వెళ్లే సర్వీసు రోడ్డులో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సాక్షి పత్రికలో ప్రచురించిన వార్తకు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిపివేయడంతో సర్వీసు రోడ్డు బంద్‌తో ఇబ్బందులు శీర్షికతో సాక్షిలో మంగళవారం వార్త ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై సీఐ ఎస్.సాయి స్పందించారు. క్రికెట్ స్టేడియం వద్ద నుంచి డీ మార్టు వైపునకు వెళ్లే ఈ సర్వీసు రోడ్డులో వాహనాల రద్దీ సాధారణంగా ఉండే సమయాల్లో నిరాటంకంగా ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తెలియజేస్తే వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎండాడ హైస్కూల్ పరిశీలన



హాజరుపట్టీ పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు, వారి డైరీలు, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను ఏ విధంగా వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి రోజూ 2 గంటలు ట్యాబ్‌లో పాఠాలు చదవాలని, ఉపాధ్యాయులు వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కష్టపడాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అనంతుని కల్యాణోత్సవాలకు రూ.20 వేల విరాళం



ఈవో నానాజీ బాబుకు చెక్కు అందజేస్తున్న రవికుమార్

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి జరగనున్న అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలకు విశాఖపట్నానికి చెందిన రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రూపాకుల రవికుమార్ మంగళవారం రూ.20వేలు విరాళం ఇచ్చారు. రవి కుమార్ చెక్కు రూపంలో ఈ విరాళాన్ని ఆలయ ఈవో ఎస్.నానాజీ బాబుకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శులు మహంతి అప్పలరమణ, పాలూరి కృష్ణారావు, యువమోర్చా అధ్యక్షుడు హంస మహేష్ పాల్గొన్నారు.

బీచ్‌లో కొత్త అందాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ తీరంలో కొత్త హంగులు సమకూరనున్నాయి. విశాలంగా, ఆహ్లాదకరంగా ఉండే ఈ బీచ్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా పర్యాటకులు సేద తీరేందుకు బెంచీలు, ఖాళీ స్థలంలో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు మంగళవారం ప్రారంభించారు.

ద్విచక్ర వాహనం చోరీ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ హాస్టల్ 12వ నంబర్ గేట్ వద్ద ఈ నెల 2న పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురయింది. శ్రీకాకుళానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్ భోగాపురం మండలం రావాడలో నివసిస్తూ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 2న ఉదయం వాహనాన్ని పార్కింగ్ చేసి సాయంత్రం వచ్చి చూసేసరికి కనిపించలేదు. దీనిపై మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైం హెడ్ కానిస్టేబుల్ ఊడికల వరలక్ష్మి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు



మురుగునీరు నిలిచిన కాలువను పరిశీలిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని కొంకువీధి ప్రాంతంలో ఉన్న కాలువ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కాలువను ఆయన పరిశీలించారు. ఇక్కడి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు పెద్ద కాలువలు సరిగ్గా లేకపోవడంతో పెద్ద ఎత్తున మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో ఈ చుట్టుపక్కల దోమలు విపరీతంగా పెరిగిపోవడంతోపాటు అంటువ్యాధులు కూడా వ్యాపిస్తున్నాయి. వర్షాలు కురిసే సమయాల్లో రోడ్డు మొత్తం మురుగునీటితో చెరువులా మారిపోతోంది. ఈ సమస్య చాలా రోజులుగా ఉంది. దీనిపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన జెడ్సీ రాము స్పందించారు. కాలువలో నీరు నిలిచిపోకుండా అవసరమైన పనులను వెంటనే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం తీరును పరిశీలించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నివారించడానికి అవకాశం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కోరాడ శైలజ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ్ లెప్రసీ అవగాహన ప్రచారం – 2023 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వరకూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కోరాడ శైలజ మాట్లాడుతూ కుష్టు వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపరాదని సూచించారు. అలాంటి వారు సమాజంలో గౌరవంగా బతికేలా ఆత్మస్థైర్యం నింపుతామని ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఎంవో ఎ.భీమేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

320 కేజీల బియ్యం సీజ్

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మారికవలస ఆర్‌జీకే కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 320 కేజీల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ కాలనీలో గల బ్లాకు నంబరు 49లో ఓ మహిళ అక్రమంగా బియ్యం నిల్వ ఉంచింది. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు.

యువత సహకారంతో ప్లాస్టిక్‌పై సమరం

కొమ్మాది: ప్లాస్టిక్ వాడకాన్ని సమూలంగా నిర్మూలించేందుకు జీవీఎంసీ చేస్తున్న సమరానికి యువత సహకారం అవసరమని, ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకునిరావడానికి ముందుకు రావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, చెత్త రహిత విశాఖ నగరంలో యువత పాత్ర అనే అంశంపై గీతంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు పెరుగుతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం పెరగాలని, ప్రజల జీవనశైలి అందుకు అనుగుణంగా మారాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు లఘు చిత్రాల పోటీలు నిర్వహించాలని సూచించారు. నగరంలో రోజూ 9 వేల టన్నుల వ్యర్థాలు డంపింగ్‌యార్డ్‌కు చేరుతున్నాయని, వాటిని శుద్ధి చేసి 15 మెగావాట్‌ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. వైద్య అధికారి డాక్టర్ శాస్త్రి, గీతం ప్రో వీసీ గౌతమ్ రావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

సర్పంచ్ రామారావుకు ఘన నివాళి



లక్ష్మీపురంలో రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: ఇటీవల మృతి చెందిన భీమిలి మండలం లక్ష్మీపురం సర్పంచ్ లచ్చుబుగత రామారావు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి రామారావు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, నాయకులు కేవీ సత్యనారాయణ, మద్దిల వెంకటరమణ, కనకల వెంకటరమణ, తుపాకుల అప్పలరాజు, గాడు తాతినాయుడు, ఉపాధ్యాయుడు రమేష్ పట్నాయిక్ తదితరులు నివాళులర్పించారు.

10న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి కన్య కా పరమేశ్వరి ఆల య ఆరో వార్షికో త్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యు లు తెలిపారు. పంచామృత అభిషేకం, గణపతి పూజ, మండపారాధన, రుద్రా భిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేరోజు మధ్యా హ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న రేఖవానిపాలెం పంచాయతీ పాలకవర్గం

తగరపువలస: ఇటీవల నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఏపీ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ – 2023లో బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించిన విద్యార్థులను భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ పాలకవర్గం మంగళవారం అభినందించింది. కాటా, కుమిటే విభాగాల్లో ఆరుగురు విద్యార్థులు కె.అభిషేక్, పి.హర్షవర్ధన్, టి.గుణశేఖర్, టి.వెంకటసాయి వర్షిత్, బి.సాయిచరణ్, బి.షర్మిల 11 పతకాలు సాధించారు. వీరితోపాటు కోచ్ కర్రి చిట్టిబాబును సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, వార్డు సభ్యుడు అక్కరమాని అప్పలస్వామి, పార్టీ అధ్యక్షుడు మల్లేటి హరిశంకర్ పాల్గొన్నారు.

చిప్పాడలో రీసర్వే ప్రారంభం



రీసర్వే ప్రారంభంలో చిప్పాడ, పెదనాగమయ్యపాలెం నాయకులు, అధికారులు

తగరపువలస: నూరుశాతం పారదర్శకతతో భూముల రీసర్వేను ప్రభుత్వం చేపట్టి విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్ర భూవివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌తో కూడిన భూకమత పటం ప్రతి ఒక్కరికి ఇవ్వనున్నట్టు భీమిలి మండలం చిప్పాడ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెంపాడ సూరిబాబు తెలిపారు. పంచాయతీలో మంగళవారం రీసర్వే కోసం చేపట్టిన డ్రోన్‌కు పూజలు చేశారు. మ్యుటేషన్, డెత్ సంబంధిత కేసుల విషయంలో కొత్తగా పాస్‌పుస్తకాల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూర్జహాన్, వీఆర్వో పి.శ్యాంసుందరరావు, పెదనాగమయ్యపాలెం పంచాయతీ అధ్యక్షుడు బొడ్డు దుర్గారావు, సరగడ రాంబాబు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయాల పరిరక్షకులు పిల్లలే

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



గ్రీన్ డేల్ స్కూలు విద్యార్థులతో ముచ్చటిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పీఎం పాలెం : విశ్వవ్యాప్తంగా కీర్తిస్తున్న భారతీయ సంప్రదాయాలకు పరిరక్షకులు నేటి చిన్నారులే అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. క్రికెట్ స్టేడియం సమీపంలోని గ్రీన్ డేల్ స్కూలును ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినయం, విధేయత, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం వంటి ఉత్తమ లక్షణాలు ఈ దేశంలో పుట్టిన వారికి వారసత్వంగా సంక్రమిస్తాయన్నారు. మాతృభాష పట్ల మమకారం ఉండాలని, ఆంగ్లభాష నేరుకోవాలన్న తపన ఉండాలన్నారు. పాఠశాలల్లో చదువుతోపాటు యోగాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూలు చైర్మన్ ఎస్వీ రవీంద్ర, కరస్పాండెంట్ విజయారవీంద్ర, ప్రిన్సిపాల్ ఎస్పీ దివ్యాదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదువానిపాలెం సంఘటనపై డీసీపీ విచారణ

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ ప్రసాదువానిపాలెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన భూ తగాదా సంఘటనపై డీసీపీ సుమిత్ సునీల్ గరుడ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విచారణ జరిపారు. పెట్రోల్ బంక్ యజమాని పర్వతనేని సురేష్ కిరాయి మనుషులతో అర్ధరాత్రి వేళ తమపై దాడి చేయించి చంపడానికి ప్రయత్నించారని, ఈ విషయమై వెంటనే 100కు ఫోన్ చేసినా పోలీసులు సరిగా స్పందించలేదని ప్రసాదునాయుడు కుటుంబ సభ్యులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ క్రమంలో సీపీ ఆదేశాల మేరకు డీసీపీ విచారణ జరిపారు. ప్రసాదువానిపాలెం సమీపంలోని ఎన్‌జీఆర్‌పురం – 1 రెవెన్యూ గ్రామంలో ప్రసాదునాయుడు పూర్వీకులకు జిరాయతీ భూములున్నాయి. అక్కడకు సమీపంలోని బంక్ యజమాని వాటిని కొనుగోలు చేసి 20 ఏళ్లుగా అనుభవిస్తుండగా ఆ భూములను తాము అమ్మలేదంటూ ప్రసాదునాయుడు కుటుంబీకులు అంటుండంతో గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రసాదు నాయుడు కుటుంబ సభ్యులు ఆ భూమిలో పాక వేసుకొని ఉండగా బంక్ యజమాని కిరాయి మనుషులతో అర్ధరాత్రి అక్కడకు వచ్చి దౌర్జన్యం చేసి తీవ్రంగా గాయపరిచారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో కేసు పూర్వాపరాలను డీసీపీ అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ వివాదాస్పద భూమి వ్యవహారం కోర్టులో ఉన్నందున వారి అనుమతి కోరామన్నారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి విచారిస్తున్నామని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మౌనిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

ఫలితాల్లో తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా..

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎస్.సిద్దార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్ నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎస్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



తాతారావు మృతదేహం

ఆనందపురం : కాలు జారి గాయాలపాలై చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందినట్టు స్థానిక పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన ఆవాల తాతారావు(60) ఈ నెల 6న రాత్రి ఇంటి వద్ద జారిపోవడంతో గాయపడ్డాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. మృతుని కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.